సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 23 । జూన్ । 2023



ఆర్టీసీ ప్రయాణం.. పాస్

విద్యార్థుల ప్రయాణానికి ఉచిత పాస్‌లు అందజేయడానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. రాయితీ పాస్‌ల జారీకి పాఠశాల, కళాశాల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. - 8లో



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వ నిధులను వెచ్చిస్తూ బీఆర్ఎస్ పార్టీ ప్రచారం చేసుకుంటోందని కాంగ్రెస్ నాయకులు మున్సిపాలిటీల్లో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. - 9లో

గరిష్టం/కనిష్టం
37.0 /28.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తరం దిశగా బలమైన గాలులు వీస్తాయి. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ టీచర్ల వసూళ్లు..?

మంచిర్యాలటౌన్: జిల్లాలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల నుంచి మంచిర్యాల ప్రాజెక్టుకు చెందిన కొందరు అంగన్‌వాడీ టీచర్లు యూనియన్ పేరిట రూ.500 నుంచి రూ. వెయ్యి వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం మే నెలలో వేసవి సెలవులు ప్రకటించింది. ఇందులో 15రోజుల చొప్పున టీచర్లు, ఆయాలకు వేసవి సెలవులు ఇవ్వగా, ఆ నెలలో మొత్తానికే కొందరు అంగన్‌వాడీ కేంద్రాలు తెరవలేదు. దీంతో ఐసీడీఎస్ అధికారికి ఒక్కో కేంద్రం నుంచి రూ.500 నుంచి రూ. వెయ్యి వరకు ఇవ్వాలని, యూనియన్ ఖర్చులకు ఇందులోనే ఉంటాయంటూ కొందరు టీచర్లు మంచిర్యాల ప్రాజెక్టు పరిధిలో వసూళ్లకు తెరలేపినట్లుగా తెలుస్తోంది. పెద్ద మొత్తంలోనే డబ్బులను వసూలు చేసి సదరు అధికారికి కొంత ముట్టజెప్పగా, యూనియన్ కోసమంటూ లీడర్లుగా చెలామణీ అవుతున్న కొందరు టీచర్లు డబ్బులు పంచుకున్నట్లుగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జిల్లాలో రెండు యూనియన్లు ఉండగా, మరో యూనియన్‌కు చెందిన టీచర్లు వసూళ్ల పర్వంపై సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఎవరెంత మొత్తంలో వసూలు చేశారనే దానిపై తీవ్రంగా చర్చ సాగుతోంది. యూనియన్ల పేరిట, టీచర్లు, ఆయాల గైర్హాజరుకు, అద్దెలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఆరు నెలలకు ఒకసారి విడుదల చేసే అద్దె డబ్బుల చెల్లింపు సమయాల్లో, యూనియన్ సమావేశాల పేరిట ఇలా కొందరు టీచర్లు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. వసూళ్ల విషయమై జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్యను ఫోనులో సంప్రదించగా.. విచారణ జరిపి వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దోమల వృద్ధి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: వర్షాకాలంలో దోమల వృద్ధి లేకుండా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌పీహెచ్‌వోలు, హెచ్‌ఈవోలు, ఎంహెచ్‌పీఎస్, ఎంపీహెచ్‌హెచ్‌లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధి, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయని, వర్షాకాలంలోనే ఈ వ్యాధుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా నిల్వ ఉన్న నీటిని తొలగించాలని తెలిపారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డా క్టర్ అనిత, డాక్టర్ సీరజ, డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ఎండీఏ తెలంగాణ స్టేట్ డాక్టర్ రాజేందర్, డీపీవో ప్రశాంతి, సిబ్బంది నాందేవ్, అల్లాడి శ్రీని వాస్, సత్యనారాయణ, శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.


కవి రాజేశంకు సత్కారం



తోకల రాజేశంను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కవిత

నెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామానికి చెందిన కవి, జిల్లా రచయితల వేదిక అధ్యక్షుడు తోకల రాజేశంను తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా యాదాద్రి దేవస్థానం, భారత జాగృతి సంస్థ సత్కరించింది. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానం ముద్రించిన శతకంలో రాజేశం రాసిన పద్యానికి చోటు దక్కింది. ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి అధ్యక్షతన గురువారం యాదాద్రిలో కవి సమ్మేళనం నిర్వహించి శతకాన్ని ఆవిష్కరించారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ చేతుల మీదుగా రాజేశం పురస్కారం అందుకున్నారు. రాజేశంను భారత జాగృతి సంస్థ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లో గురువారం ఘనంగా సన్మానించారు. రచయితల వేదిక అధ్యక్షులుగా జిల్లా సాహితీ రంగానికి చేస్తున్న సేవకు గాను ఆయనకు ఈ సత్కారం దక్కిందని కవిత కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, తెలంగాణ సాహితీ అకాడమీ అధ్యక్షుడు జులూరి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ గూటిలో అసమ్మతి !



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార బీఆర్ఎస్ పార్టీలో అసమ్మతి, వర్గ పోరు పెరిగిపోతోంది. గ్రామ, మండల, పట్టణ, నియోజకవర్గ స్థాయి గులాబీ నాయకుల్లో ఐక్యత కొరవడుతోంది. కొన్ని చోట్ల ఎమ్మెల్యేల తీరుతో, మరికొన్ని చోట్ల వర్గ పోరుతో చీలిక ఏర్పడుతోంది. వచ్చే ఎన్నికల వరకు ఎంతమంది పార్టీలో ఉంటారు? ఎంతమంది కారు దిగుతారోననే చర్చ సాగుతోంది.

- కింది స్థాయి కేడర్‌లో అసంతృప్తి
- పార్టీకి వ్యతిరేకంగా మారుతున్న నాయకులు
- ప్రతిపక్షాలకు అనుకూలంగా మారుతున్న పరిస్థితులు
- ఎన్నికలకు ముందు అధికార పార్టీకి ఇబ్బందులు

మంచిర్యాలలో లుకలుకలు

మంచిర్యాల నియోజకవర్గ వ్యాప్తంగా అంతర్గత విభేదాలు నెలకొన్నాయి. ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుస్కూరి రామ్మోహన్ రావు రంగ ప్రవేశంతో వర్గాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇటీవల హాజీపూర్ జెడ్పీటీసీ పుస్కూరి శిల్ప ఎమ్మెల్యే దివాకర్‌రావు తమని పట్టించుకోవడం లేదని బహిరంగంగానే విమర్శలు చేశారు. రైతుబంధు మండల కన్వీనర్ పుస్కూరి శ్రీనివాసరావు, మాజీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొమ్మటి సత్తయ్య, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకర్, తదితర నాయకులు అసమ్మతితో ఉన్నారు. లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల్లోనూ వర్గాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని కొందరు కౌన్సిలర్లు, మాజీలు, నాయకులు, పార్టీలో అసంతృప్తిగానే ఉన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేశ్ గౌడ్ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తుండడంతో ఎమ్మెల్యే వర్గంతో వేరుపడి ఉన్నారు. ఇక కార్మిక క్షేత్రం నస్పూర్, శ్రీరాంపూర్‌లో కార్మిక నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రూప్‌లుగా విడిపోయి ఉన్నారు.

బెల్లంపల్లిలో రగడ

బెల్లంపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై ఆరోపణల నేపథ్యంలో ఆయన వ్యతిరేక వర్గం అలర్ట్‌గా ఉంది. సమయం దొరికితే అనుకూలంగా మలుచుకునే పనిలో ఉన్నారు. ఇక్కడ టికెట్ ఆశిస్తున్న వారిలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ ఉన్నారు. వేమనపల్లి మండల జెడ్పీటీసీ స్వర్ణలత, నీల్వాయి ఎంపీటీసీ సంతోష్ వీరిద్దరూ భార్యాభర్తలు. ఎప్పటి నుంచో పార్టీకి దూరంగానే ఉంటున్నారు. మొదట కాంగ్రెస్ నుంచే గెలిచి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. మళ్లీ పార్టీ మార్పు ఖాయం అంటున్నారు. ఇక కన్నెపల్లి మండలం ఎంపీపీ సృజన నర్సింగారావు సైతం అసమ్మతితో ఉన్నా రు. బెల్లంపల్లి పట్టణంతోపాటు తాండూరు మండలంలో కింది స్థాయిలో అసమ్మతి ఉంది. నియోజకవర్గంలో ఓ జెడ్పీటీసీ, ఎంపీపీ కూడా లోపల తమను పట్టించుకోవడం లేదనే ఆవేదనలో ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ నుంచి వివేక్, కాంగ్రెస్ నుంచి వినోద్ అసంతృప్తి నేతలతో ఇప్పటికే సంప్రదింపులు చేశారు. తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఇప్పుడే పార్టీ మారకుండా నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నారు.

ఖానాపూర్‌లోనూ అంతే..

ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న జన్నారం మండలంలోనూ అధికార పార్టీలో అసమ్మతి ఉంది. స్థానిక జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ గత కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఎంపీపీ సరోజన, చింతగూడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ విజయ్‌ధర్మ తదితర నాయకులు పార్టీని అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పార్టీని చక్కబెట్టేదెవరు?

అధికార పార్టీలో అంతర్గత వర్గ పోరు, అసమ్మతి చక్కబెట్టేదెవరనది పెద్ద ప్రశ్నగా మారింది. జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పూర్తి స్థాయిలో పార్టీ వ్యవహారాలపై దృష్టి సారించలేదనే నాయకులు చెబుతున్నారు. ఇటీవల సీఎం సభ, పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవాలు అట్టహాసంగా జరిగినా ఎవరికి వారే అన్నట్లు సాగింది. జిల్లాలో సీనియర్లుగా ఉన్న ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షుడి మాట వినే స్థాయిలో ఉన్నారా? అంటే, చెప్పలేని పరిస్థితి. ఇప్పటికే తన నియోజకవర్గానికే ఎక్కువ నిధులు తీసుకెళ్తున్నారని, సుమన్‌పై ఒకింత వ్యతిరేకత ఉంది. ఈ నేపథ్యంలో మూడోసారి రాష్ట్రంలో హ్యాట్రిక్ కొట్టాలని ఆరాట పడుతున్న గులాబీ పార్టీకి జిల్లా పరిస్థితులు ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం, అసెంబ్లీ, తర్వాత లోక్‌సభ ఎన్నికలు వరుసగా ఉన్నాయి. ఏ మాత్రం అవకాశం చిక్కినా జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ తదితర పార్టీలు బీఆర్ఎస్‌ను దెబ్బ కొట్టాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో పార్టీలో విభేదాలను తగ్గించి వచ్చే ఎన్నికలను ఎలా ఎదుర్కొంటారనేది జిల్లా నాయకత్వానికి పెద్ద సవాల్‌గా మారింది.

చెన్నూరులోనూ..

చెన్నూరు నియోజకవర్గంలో లోలోపల అసంతృప్తులు ఉన్నప్పటికీ ఇంకా బయటపడడం లేదు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు ఇంకా ఎవరూ ఎదురు వెళ్లడం లేదు. గతంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు, జెడ్పీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి దంపతులు పార్టీ మారి వెంటనే సొంత గూటికి చేరారు. ఆ తర్వాత భీమారానికి చెందిన సీనియర్ నాయకుడు సరోత్తంరెడ్డి బాల్క సుమన్‌పై తీవ్రంగా విమర్శలు చేసి, మళ్లీ సైలెంట్ అయిపోయారు. వీరు తప్ప ఎవరూ పార్టీకి వ్యతిరేకంగా పెదవి విప్పలేదు. ఎమ్మెల్యే తమకు సరైన సమయం, ప్రాధాన్యత ఇవ్వడం లేదని రగులుతున్నట్లు చెప్పుకుంటున్నారు. మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూరు మున్సిపల్ పరిధిలోని నాయకులు, కోటపల్లి, జైపూర్‌లో అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

ఊరటనిచ్చిన వాన

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్ ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా వర్షాల్లేక ఎండలు మండుతుండడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ తరుణంలో బుధవారం కురిసిన వర్షం కొంత ఊరటనిచ్చింది. జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు 4.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జైపూర్ మండలంలో మినహా మిగతా 17 మండలాల్లో చిరుజల్లు, తేలికపాటి వర్షం కురిసింది. విత్తనాలు వేసుకొని కొంతమంది రైతులు, వేసుకోవడానికి మరికొందరు ఎదురు చూస్తుండగా.. చల్లబడ్డ వాతావరణంతో సాగుపై ఆశలు చిగురించాయి. బుధ, గురువారాల్లో మబ్బులు కమ్ముకోవడంతో ఈదురుగాలులు, తేలికపాటి వర్షం కురవడంతో రైతులు చేనుబాట పట్టారు. ఆలస్యంగా రుతుపవనాల రాకతో జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

జిల్లాలో నమోదైన వర్షపాతం

కాసిపేట మండలంలో 17.1 మిల్లీమీటర్లు, తాండూర్‌లో 13.1, నెన్నెలలో 8.2, బెల్లంపల్లిలో 8, వేమనపల్లిలో 7.4, కన్నెపల్లిలో 6.2, చెన్నూర్‌లో 5.5, హాజీపూర్‌లో 4.6, దండేపల్లిలో 3.5, కోటపల్లిలో 3.4, మందమర్రిలో 2.7, జన్నారంలో 2.5, భీమారంలో 2.3, మంచిర్యాలలో 2.1, నస్పూర్‌లో 0.7, భీమినిలో 0.7, లక్సెట్టిపేటలో 0.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా సాధారణ వర్షపాతం ఇప్పటివరకు 113.8 మిల్లీమీటరు కాగా 11.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 90 శాతం లోటు వర్షపాతం నెలకొంది.

‘ఎవరి కోసం దశాబ్ది సంబరాలు’

మంచిర్యాలటౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట నిర్వహించిన సంబరాలను ఎవరి కోసం చేపట్టారని మంచిర్యాల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. గురువారం తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మాట్లాడుతూ హరితహారంలో నాటిన మొక్కలు సగానికి పైగా ఎండిపోగా హరితోత్సవాన్ని, మున్సిపాలిటీ ప్రజలకు తాగు నీటిని అందించకుండా మంచినీటి ఉత్సవాలను ఎందుకు చేసుకున్నారని ప్రశ్నించారు. వాటర్ ట్యాంకర్ల కోసం కౌన్సిలర్లు కొట్టుకోవాల్సిన పరిస్థితిని తీసుకొచ్చినందుకు ఈ సంబరాలు చేసుకున్నారా అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఉప్పలయ్య, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు మాజిద్, వేములపల్లి సంజీవ్, రామగిరి బానేశ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట



చెన్నూర్: బహిరంగ సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల

- మత్స్యశాఖ నుంచి కిసాన్ క్రెడిట్ కార్డులు
- కేంద్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి పరుషోత్తం రూపాల

చెన్నూర్: కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని కేంద్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి పరుషోత్తం రూపాలా అన్నారు. తొమ్మిదేళ్ల మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం చెన్నూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2014లో దేశంలో అవినీతి రాజ్యమేలిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి లేకుండా చేశారని అన్నారు. రైతులకు ఏటా రూ.18 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. మత్స్యశాఖ వారి కిసాన్ క్రెడిట్ కార్డులు అందిస్తామని చెప్పారు. రాష్ట్రానికి కేంద్రం అనేక నిధులు మంజూరు చేసిందని, ఇక్కడ మాత్రం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నేటికీ ఇవ్వలేదని విమర్శించారు. కాళేశ్వరం ఆలయానికి ప్రత్యేకత ఉందని, కాళేశ్వరం పేరుతో ప్రజలకు అన్యాయం చేయడాన్ని దేవుడు క్షమించడని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని విమర్శించారు. గోదావరి పరిరక్షణ కోసం చెన్నూర్ గోదావరి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం మండలంలోని గంగారం, అస్నాద్ గ్రామాలకు చెందిన ఇద్దరు వార్డు సభ్యులతోపాటు పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎరబెల్లి రఘునాథ్‌రావు, బెల్లంపల్లి ఇన్‌చార్జి ఏమాజీ, ప్రభాకర్, జిల్లా నాయకులు వెంకటేశ్వర్‌గౌడ్, సుశీల్ కుమార్, చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వం

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల శివారులో ఉన్న బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల విమర్శించారు. గురువారం సాయంత్రం ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు గుట్టల నడుమ అటవీ ప్రాంతంలో ఆలయం ఎంతో విశాలంగా ఉందని తెలిపారు. అనంతరం ఆయనను బెల్లంపల్లి బీజేపీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటకృష్ణ, బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

గడప గడపకు బీజేపీ ప్రచారం ప్రారంభం

తాండూర్: మండల కేంద్రంలో గురువారం గడపగడపకు బీజేపీ ప్రచారాన్ని కేంద్రమంత్రి పరుషోత్తం రూపాల ప్రారంభించారు. విద్యాభారతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్‌సీఐ సభ్యుడు పుల్లం తిరుపతి, నాయకులు కృష్ణదేవరాయలు, శ్రీవాణి, చిరంజీవి, సంతోష్, విష్ణు, ప్రవీణ్ పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అమరులు చేసిన త్యాగాలు మరువలేనివని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. జిల్లా కేంద్రం మంచిర్యాల బైపాస్ రోడ్డులోని అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలను సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతోమంది పోరాటాలు చేయగా, మరికొందరు అమరులయ్యారని, వారి త్యాగాల ఫలితంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో అమరవీరులకు ఒక రోజు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం బైపాస్ రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, కౌన్సిలర్ పల్లపు సాయి భార్గవి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



అమరుల కుటుంబ సభ్యులకు సన్మానం

అమరుల కుటుంబాలకు సన్మానం

తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన వారి కుటుంబ సభ్యులను కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సంతోష్ ఘనంగా సన్మానించారు. అంతకుముందు అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అమరుల కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో భోజనాలు చేసి, అమరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బీజేపీకి ప్రజలే గుణపాఠం చెబుతారు

- ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్సెట్టిపేట: రాబోయే ఎన్నికల్లో ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండా ఎగురుతుందని, ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లక్సెట్టిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఇతర నాయకులు బీఆర్ఎస్ పార్టీ, ముఖ్యమంత్రిపై చేసిన వాఖ్యలపై మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో మంచిర్యాలలో బీజేపీ నామరూపాలు లేకుండా పోతుందని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రైతులకు సంక్షేమ పథకాలను అందించి అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. ఎంపీగా గెలిచి కరీంనగర్‌ను ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ప్రజలు అన్ని చూస్తున్నారని కనీసం రైల్వే బ్రిడ్జి కూడా నిర్మాణం చేయలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాట్లాడుతున్నారని విమర్శించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, కౌన్సిలర్ రాజన్న పాల్గొన్నారు.

తెలంగాణ ఎన్నికల్లో పోటీకి ఎన్‌సీపీ సిద్ధం



ఎమ్మెల్యే ధర్మారావుబాబాను సన్మానిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) సిద్ధంగా ఉందని ఆ పార్టీ మహారాష్ట్ర అహేరి ఎమ్మెల్యే, అటవీ శాఖ మాజీ మంత్రి ధర్మారావు బాబా ఆత్రం అన్నారు. గురువారం బెల్లంపల్లికి వచ్చిన ఆయన పాత బస్టాండ్ ఏరియా తిలక్ స్టేడియం ముందు ఎన్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో మాదిరిగానే తెలంగాణలోనూ ఎన్‌సీపీ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటుందని తెలి పారు. మహారాష్ట్రకు ఆనుకుని ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాలను పోటీలో దింపుతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుమ్మిడి గోపాల్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి మద్దెల శ్రీనివాస్, పవన్, రాజు, సిద్దు, శిరీష, రమ, సంధ్య, మహిళలు పాల్గొన్నారు.

అమరులను స్మరిస్తూ జెడ్పీ తీర్మానం

- నివాళులకే సభ పరిమితం
- బహిష్కరించిన కాంగ్రెస్ జెడ్పీటీసీ



నివాళులర్పిస్తున్న భాగ్యలక్ష్మి, అధికారులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ అమర వీరులను స్మరిస్తూ జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక జెడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర సాధనలో ప్రాణాలు అర్పించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జెడ్పీ సీఈవో కే.నరేందర్ అమరుల సంస్మరణ తీర్మాన కాపీని చదివి వినిపించి సభ్యుల సమక్షంలో తీర్మానం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన లక్సెట్టిపేట జెడ్పీటీసీ సభ్యుడు ముత్తె సత్తయ్య అమరులకు నివాళులు అర్పించి, సంస్మరణ తీర్మానం అనంతరం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఎలాంటి అభివృద్ధి చేయకుండానే ప్రభుత్వం నిర్వహించడాన్ని నిరసిస్తూ బహిష్కరించి వెళ్లిపోయారు. ప్రభుత్వ నిధులను బీఆర్ఎస్ పార్టీ ప్రచారం కోసం వృథా చేస్తున్నారని, ప్రజల తాగునీటి ఇబ్బందులను పట్టించుకోకుండా ఉత్సవాలు నిర్వహించడం దారుణమని అన్నారు. అనంతరం సమావేశంలో ఎలాంటి అంశాలు చర్చించకుండా, కనీసం జెడ్పీ చైర్‌పర్సన్ అమరుల గురించి ఏమి మాట్లాడకుండానే సమావేశాన్ని ముగించడం చర్చనీయాంశంగా మారింది.

2న సీఆర్టీ పరీక్ష

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు టీచర్(సీఆర్టీ)గా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 2వ అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ఇంచార్జి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి చిరంజీవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఫిజికల్ సైన్స్‌లో ఒక్క పోస్టు ఖాళీగా ఉండగా, 50 దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల 24నుంచి 26 వరకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయానికి వచ్చి హాల్‌టికెట్ తీసుకోవాలని సూచించారు.

సీఆర్టీ దరఖాస్తుదారుల ఆందోళన

జిల్లాలో మిగతా సబ్జెక్టుల్లో ఖాళీలు లేకపోయినా పలువురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 2న ఫిజిక్స్ సబ్జెక్టుకు సంబంధించిన అర్హత పరీక్ష మాత్రమే రాసేందుకు హాల్‌టికెట్‌లు జారీ చేయగా, ఇతర సబ్జెక్టుల్లో దరఖాస్తు చేసుకున్న వారు గురువారం కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఒక్క పోస్టు కూడా లేని ఎస్‌ఏ హిందీకి 13, ఎస్‌ఏ ఇంగ్లిష్‌కు 49, ఎస్‌ఏ మ్యాథ్స్‌కు 92, ఎస్‌ఏ బయోలజీలో 75 మంది, ఎస్‌ఏ సోషల్‌కు 75 మంది, ఎస్జీటీ పోస్టులకు 337 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 94 సీఆర్టీ పోస్టులకు గాను ప్రస్తుతం 99 మంది పనిచేస్తున్నారని, ఒక్క ఫిజిక్స్ పోస్టుకు మాత్రమే దరఖాస్తులు ఆహ్వానించారని అధికారులు తెలిపారు. ఇతర సబ్జెక్టుల్లో ఖాళీలు లేకపోయినా కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు తీసుకోవాలని అభ్యర్థించడంతోనే తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్నామని, కానీ వారికి ఎలాంటి అర్హత పరీక్షకు అనుమతి రాలేదని ఏటీడీవో చిరంజీవి తెలిపారు.

క్లుప్తంగా

బ్లేడ్ ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



సాయికిరణ్ మృతదేహం

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద శివారులోని రైస్‌మిల్ వద్ద బ్లేడ్ ట్రాక్టర్ బైక్‌ను ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన సాయికిరణ్ (21) బుధవారం ఆస్నాదలో తన స్నేహితుడిని కలిసేందుకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి వస్తుండగా రైస్‌మిల్ వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన బ్లేడ్ ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. సాయికిరణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా ఎల్లక్కపేటలోని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని, మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గెడం నవీన్‌కుమార్ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. కుమురంభీం జిల్లా కౌటగూడకు చెందిన నవీన్‌కుమార్ గత నాలుగేళ్లుగా రాపల్లి స్టేజీ వద్ద తన సోదరి ఇంట్లో ఉంటున్నాడు. మంచిర్యాలలో కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం కూలీ పనికెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వెళ్లేందుకు రాపల్లి స్టేజీ వద్ద జాతీయ రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన నవీన్‌కుమార్‌ను 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం రామగుండం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి నవీన్‌కుమార్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి వివాహం కాలేదు. కాగా, అతని బావ నైతం వర కుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాలి ఆడక కార్మికుల అవస్థలు

శ్రీరాంపూర్: ఎస్‌ఆర్పీ 1 గనిలో గాలి ఆడక కార్మికులు అవస్థలు పడుతున్నారని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్కే బాజీసైదా, కె.వీరభద్రయ్య ఓ ప్రకటనలో తెలిపారు. వెంటిలేషన్ అందడం లేదని పేర్కొన్నారు. కార్మికులు అధికారులను అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. కేవలం గుర్తింపు సంఘం నాయకులతోనే మాట్లాతామంటూ కార్మికుల సమస్యలను అధికారులు గాలికి వదిలేస్తున్నారని పేర్కొన్నారు. ఏరియా ఉన్నతాధికారులు కార్మిక సమస్యలపై అన్ని సంఘాలతో చర్చించాలని లేకపోతే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆర్టీసీ ప్రయాణం..పాస్



మంచిర్యాల బస్‌పాసు కౌంటర్

- విద్యార్థులకు ఉచిత పాస్‌ల పంపిణీకి ఆర్టీసీ ఏర్పాట్లు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- కళాశాల, పాఠశాల విద్యార్థులకు తప్పనున్న ఇక్కట్లు

బస్‌పాసుల చార్జీల వివరాలు

కి.మీ	నెలకు	మూడునెలలకు
5	రూ.150	రూ.400
10	రూ.250	రూ.680
15	రూ.300	రూ.900
20	రూ.400	రూ.1150
25	రూ.450	రూ.1350
30	రూ.500	రూ.1500
35	రూ.550	రూ.1600

మంచిర్యాలఅర్బన్: ఈనెల 12 నుంచి పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయ్యాయి. దూరప్రాంతాల నుంచి కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు తప్పటం లేదు. పాస్‌లు పొందితే బస్సులు ప్రారంభించేందుకు ఆర్టీసీ సన్నద్ధమైంది. విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు నిత్యం వచ్చివెళ్లేందుకు బస్‌పాస్‌లు అవసరంతో ఉచిత రాయితీ పాస్‌లు అందించేందుకు ఆర్టీసీ అన్ని ఏర్పాట్లుచేసింది.

ఎంతో ప్రయోజనం..

తమ విద్యార్థులకు బస్‌పాసులు మంజూరు చేయాలంటే ప్రైవేట్ విద్యాసంస్థలు ఆర్టీసీ పేరిట డీడీలు రూపంలో నగదు చెల్లించాల్సి ఉంది. ఆర్టీసీ ప్రత్యేకంగా యూజర్ నేమ్ పాస్‌వర్డ్ కేటాయిస్తుంది. తమ పాఠశాలల్లోని 12 ఏళ్లలోపు బాలురు, పదోతరగతి వరకు బాలికలు ఉచిత పాసులు పొందాలన్నా ప్రైవేట్ విద్యాసంస్థలు ఆర్టీసీకి నగదు చెల్లించాల్సి ఉంటుంది. అకౌంట్స్ ఆఫీసర్ టీఎస్‌ఆర్టీసీ ఆదిలాబాద్ పేరిట డీడీలను తీసి సమీపంలోని డిపోల్లో అందజేయాల్సి ఉంటుంది. 200 మంది లోపు విద్యార్థులున్నా పాత, కొత్త ప్రైవేట్ పాఠశాలలు రూ.700, 500లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు రూ.1000, 500 మంది పైన విద్యార్థులున్నా పాఠశాలలు అడ్మిస్ట్రేటివ్ చార్జీలు (రెన్యూవల్) రూ.1500, అడ్మిస్ట్రేటివ్ చార్జీలు (ఫ్రెష్) కింద రూ.2వేలు చెల్లించాలి. డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు రూ.6వేలు (కొత్తవి), రెన్యూవల్ కోసం రూ.5వేలు చెల్లించాలి. జూనియర్, డిప్లొమా, ఒకేషనల్ యాజమాన్యాలు అడ్మిస్ట్రేటివ్ చార్జీలు కింద రూ.5వేలు, రెన్యూవల్ కోసం రూ.4 వేలు చెల్లించాలి.

ఉచిత పాసులు ఇలా..

గ్రామీణ ప్రాంతాలకు రాకపోకలు సాగించే పల్లె వెలుగు బస్సుల్లో 12 ఏళ్ల లోపు(బాలురు) విద్యార్థులంతా 20 కి.మీ దూరం వరకు పాఠశాలకు వెళ్లిరావడానికి రోజు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పిస్తున్నారు. పదో తరగతి వరకు చదువుకునే బాలికల కోసం ప్రయాణానికి అనుమతిస్తున్నారు. ఆర్టీసీ పాస్‌కోసం ఇంట్లో నుంచి పొందే అవకాశం అందుబాటులోకి వచ్చింది. పైసా ఖర్చులేకుండా వెబ్‌సైట్‌లో అడిగిన వివరాలు పొందుపర్చి ఫొటో అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవచ్చు. www.online.tsrtcpass. in వెబ్‌సైట్‌లో రిజిష్టర్ అయితే నమోదు సంఖ్య వస్తుంది. దాన్ని పాస్ కౌంటర్‌లోని సిబ్బందికి తెలియజేస్తే బస్‌పాస్ పొందవచ్చు. తప్పనిసరిగా ఆయా విద్యాసంస్థలు అంగీకరిస్తేనే పాస్ జారీ అవుతుంది. నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఏడాదికి రూ.50 చెల్లిస్తే బస్‌పాస్ అందిస్తారు.

35 కి.మీ లోపు రాయితీ పాసులు

మంత్లీ స్టూడెంట్ బస్‌పాస్ రాయితీ కూడిన విద్యార్థులు చార్జీలు కేటాయించారు. ప్రైవేట్ పాఠశాలల్లోని 12 ఏళ్లు పైబడిన బాలురతోపాటు కళాశాలల విద్యార్థులు ఆర్టీసీ రాయితీ పాస్‌లు పొందవచ్చు. 35 కి.మీ మాత్రమే ప్రయాణించేందుకు అవకాశం ఉన్నా బస్‌పాస్‌లకు కి.మీ చొప్పున చార్జీలు వసూలు చేస్తారు. గుర్తింపుకార్డు కోసం అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. 12 ఏళ్లలోపు బాలురు ఉచిత బస్‌పాస్ ధర రూ.30, 18 ఏళ్లలోపు బాలికలకు ధర రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. పాస్ ఏడాదిపాటు చెల్లుబాటు అవుతుంది.

ప్రైవేట్ విద్యాసంస్థలు డీడీలు చెల్లించాలి

విద్యార్థులకు ఉచిత పాస్‌లే కాకుండా రూట్‌పాస్‌లు కూడా జారీ చేస్తారు. బస్‌పాసులు పొందడానికి విద్యాసంస్థలు అడ్మినిస్ట్రేటివ్ రుసుము చెల్లించాలి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు దీని నుంచి మినహాయింపు ఉండగా ప్రైవేట్ సంస్థలు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రుసుము చెల్లించాల్సి ఉంటుంది. విద్యాసంస్థను బట్టి వార్షిక రుసుము నిర్దేశించారు. రుసుము చెల్లించి అనుమతి పొందిన వారికే ఆర్టీసీ ఆన్‌లైన్‌లో చోటు లభిస్తోంది. దీని ఆధారంగా విద్యార్థులకు రాయితీ బస్‌పాస్‌ల జారీ కొనసాగనుంది. 3 నెలలు, 6 నెలలు ఇలా కాలపరిమితి కూడిన బస్‌పాస్‌లు కిలోమీటర్ బట్టి రాయితీతో పొందవచ్చు.

విద్యార్థులకు ప్రయోజనం..

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం. అంతకుమించి ప్రయాణ సౌకర్యం విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. ప్రైవేట్ విద్యాసంస్థలు ఆర్టీసీ పేరిట డీడీలు చెల్లించాలి. విద్యార్థులకు బస్‌పాసులు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల సౌకర్యార్థం బస్‌స్టేషన్‌లో బస్‌పాసు కౌంటర్ ఏర్పాటు చేశాం. వివరాలకు 9985445438లో సంప్రదించవచ్చు.

– రవీంద్రనాథ్, ఆర్టీసీ డీఎం, మంచిర్యాల

జన్నారం డివిజన్‌లో ట్రెయినీ బీట్ అధికారులు



గేట్ నంబర్ 1 వద్ద అడవుల గురించి వివరిస్తున్న ఎఫ్‌డీవో మాధవరావు

జన్నారం: దూలపెల్లి ఫారెస్ట్ అకాడమీ నుంచి శిక్షణ బీట్ అధికారులు గురువారం జన్నారం అటవీ డివిజన్‌లో పర్యటించారు. 35 మంది శిక్షణ బీట్ అధికారులు ఇక్కడికి రాగా వారిని గొండుగూడ బేస్ క్యాంప్, గడ్డి మైదానాలు, నీటి కుంటల నిర్మాణం తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఎఫ్‌డీవో మాధవరావు వివరించారు. వేసవిలో నీటి సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన పనులను తెలియజేశారు. రాత్రి ఇక్కడే బస చేసిన శుక్రవారం ఇందన్‌పల్లి రేంజ్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి తిరిగివెళ్తారని ఎఫ్‌డీవో తెలిపారు.

'లోకోస్'లో స్వయం సహాయక సంఘాల సమాచారం

- కొత్తగా యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం

జిల్లా సమాచారం..
వీవోలు: 468
గ్రామైఖ్య సంఘాలు : 10353,
సభ్యులు 1,11,731



'లోకోస్ యాప్



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

పాతమంచిర్యాల: స్వయం సహాయక సంఘాల సమగ్రమైన, ఖచ్చితమైన సమాచారం తెలుసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం లోకోస్ యాప్‌ను ప్రవేశపెట్టింది. దేశంలోని స్వయం సహాయక సంఘాల పూర్తి సమాచారాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకునే వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతం స్వయం సహాయక సంఘాల పొదుపు లెక్కలు, సంఘాల పనితీరు, సంఘాలలోని సభ్యుల సంఖ్యను బుక్ కీపింగ్ లేదా మొబైల్ బుక్ కీపింగ్, సెర్ప్ అకౌంటింగ్ యాప్, నేషనల్ రూరల్ లైవ్‌లీవుడ్ మిషన్ యాప్ ద్వారా నిర్వహిస్తున్నారు. కాని ఈ యాప్‌ల కంటే అడ్వాన్స్‌డ్‌గా యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ద్వారా సంఘాలలోని సమాచారాన్ని ఒక్క క్లిక్‌తో ఎక్కడి నుంచైనా తెలుసుకోవచ్చు. మహిళా సంఘాల సభ్యులకు సంబంధించి బ్యాంక్ రుణాలు, పొదుపు లెక్కలు ఒక్క సంఘానికి సంబంధించినవి మాత్రమే తెలుసుకునే వెసులుబాటు ఉండేది. డిజిటలైజేషన్ ద్వారా అన్ని సంఘాలు చైతన్యవంతమయ్యాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అప్పులు, పొదుపు లెక్కలను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకునేది. కానీ ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం మహిళా సంఘాల సమాచారాన్ని ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లలో పొందుపరుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ద్వారా మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేస్తుంటే కేంద్రం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, (వీఎల్‌ఆర్) మంజూరు చేస్తుంది. ఈ లోకోస్ యాప్ పనితీరుపై ఇప్పటికే సెర్ప్ అధికారులు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. రెండు నెలల క్రితమే యాప్‌లో సంఘాల సమాచారం పొందుపర్చాల్సి ఉండగా వీవోఏల సమ్మె కారణంగా నమోదు ప్రక్రియ ప్రారంభం కాలేదు.

శిక్షణ కల్పిస్తున్నాం

లోకోస్ యాప్ విధి విధానాలను సెర్ప్ సిబ్బందికి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. శిక్షణ అనంతరం సంఘాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం.

– శ్రీనివాస్, అడిషనల్ డీఆర్‌డీవో, మంచిర్యాల

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మంచిర్యాలటౌన్: తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యూపీఎస్సీ, సివిల్ సర్వీసెస్ 2024 పరీక్షకు 100 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సివిల్ సర్వీసెస్ అప్టిట్యూడ్ టెస్టులో ప్రవేశం కోసం రాష్ట్రంలోని సాధారణ/ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి ఈనెల 26 నుంచి జులై 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 23న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో స్క్రీనింగ్ టెస్టు ఉంటుందన్నారు. వివరాలకు www. cet. cgg. gov. in/ tmries వెబ్‌సైట్‌లో, ఫోన్ నంబర్ 040–23236112లో సంప్రదించాలని సూచించారు.

సమ్మెలో కేకే ఓసీపీ కాంట్రాక్టు కార్మికులు



కార్మికులతో చర్చిస్తున్న సీఐ, కేకే ఓసీ పీవోలు

కాసిపేట: మందమర్రి ఏరియా కేకే ఓసీపీలో కాంట్రాక్టు కార్మికులు, డ్రైవర్లు గురువారం మొదటి షిఫ్టు నుంచి విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. ఆర్‌వీఆర్ కాంట్రాక్టు సంస్థలో పనిచేసే కార్మికులు సంస్థ తమను నమ్మించి మోసం చేస్తుందని ఆరోపించారు. కార్మికుల సమ్మె విషయం తెలుసుకున్న మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, కేకే ఓసీ పీవో రమేశ్‌కుమార్ వారితో చర్చించారు. ఎన్ని ప్రయత్నాలు చేసిన వారు ఒప్పుకోకపోవడంతో సమ్మె కొనసాగింది. కార్మికులు మాట్లాడుతూ ఇదే కంపెనీ గోదావరి ఖనిలో చెల్లించిన విధంగా తాము వేతనాలు చెల్లించాలని నేడు రేపు అంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. మూడు షిఫ్టుల సమ్మెతో పనులు బంద్ అయ్యాయి.

గాలివానకు కూలిన పశువుల కొట్టాలు



పరిశీలిస్తున్న నాయకులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ అచ్యుతరావు గూడెం, పెద్దపూర్‌లో బుధవారం సాయంత్రం కురిసిన గాలివానకు పలువురి పశువుల కొట్టాలు కూలిపోయాయి. అదేవిధంగా ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. అచ్యుతరావుగూడెంకు చెందిన సిడం రాజు, మడావి ఏసుబాయి, మడావి దశరథ్, కోట్నాక సింధుజ, పెద్దగూడెంకు చెందిన కనక జలపతిల షెడ్లు కూలిపోయాయి. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఆత్రం జంగు గురువారం కూలిన షెడ్లు, లేచిపోయిన ఇంటి పై కప్పు రేకులను పరిశీలించి బాధితులను పరామర్శించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది బాధితుల వివరాలు నమోదు చేసుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి



సత్తార్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. స్థానిక మ్యాదరివాడకు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుడు మహ్మద్ సత్తార్(60) వేంపల్లి వైపు నుంచి మంచిర్యాలకు తన ఎలక్ట్రికల్ మోటర్ సైకిల్‌పై వస్తున్నాడు. పాత మంచిర్యాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలైన సత్తర్‌ను స్థానికులు 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని చల్మెడ ఆనంద్‌రావ్ ఆసుపత్రికి తరలించారు. గురువారం వైద్యులు పరిశీలించి సత్తర్ మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య షహేద సుల్తానా, కుమారుడు మహ్మద్ పర్వేజ్ ఉన్నారు. కుమారుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట ఆడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎస్పీఎం న్యూకాలనీలో పేకాట స్థావరంపై గురువారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. కాగజ్‌నగర్, సిర్పూర్ (టి) మండలాలకు చెందిన 8 మంది పేకాట ఆడుతుండగా పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 19వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

గుర్తింపు కాలపరిమితి నాలుగేళ్లు ఉండాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి నాలుగేళ్లుగా ఉండాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (140/2018) సెంట్రల్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సెంట్రల్ చీఫ్ లేబర్ కమిషనర్(సీఎల్సీ, ఢిల్లీ)కి లేఖ రాసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో 7వ దఫా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నారని, ఈక్రమంలో గుర్తింపు కాలపరిమితిపై లేబర్ కమిషనర్ నుంచి స్పష్టమైన కాలపరిమితి ప్రకటించడం లేదన్నారు. 1998లో గుర్తింపు సంఘం ఎన్నికలు మొదలైనప్పుడు రెండేళ్ల కాలపరిమితి ఉండేదని, కాని క్రితం సారి దాన్ని నాలుగేళ్ల పాటు కొనసాగించారని తెలిపారు. దీనిపై గత ఎన్నికల్లో స్పష్టత ఇవ్వకుండా కొనసాగించారన్నారు. ఈసారి ఎన్నికల షెడ్యూల్‌లోనే ముందుగానే గుర్తింపు సంఘం కాలపరిమితి నాలుగేళ్లుగా పెట్టాలని కోరారు.

'డబుల్' ఇళ్లు పూర్తయ్యేదెప్పుడో..!

- ఆరేళ్లుగా సాగుతున్న పనులు
- లబ్ధిదారుల ఎదురుచూపులు



ప్లాస్టరింగ్ పూర్తయిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు

బెల్లంపల్లి: పేదల సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో బెల్లంపల్లిలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. పనులు నత్తనడకన సాగుతున్నాయి. కన్నాల శివారు జాతీయ రహదారిని ఆనుకుని 2017 జూన్ 10న ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ భూమి పూజ చేశారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమై ఆరేళ్లు కావస్తుండగా ఇప్పటికీ పూర్తి కాలేదు. అనేక అవరోధాలతో అపసోపాలు పడుతూ ప్రస్తుతం సగానికి పైగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు తుది దశకు చేరాయి. రూ.968 లక్షల అంచనాతో 160 2బీహెచ్‌కే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. నిర్మాణ వ్యయం యేటా పెరుగుతుండగా ఇప్పటికే పూర్తి కావాల్సిన ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. ఎప్పుడెప్పుడా అని ఎంతో ఆశతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

తుది దశలో పనులు..

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. మరోపక్క పైపులైన్ పనులు నిర్వహిస్తున్నారు. కొన్ని ఇళ్లకు తలుపులు, కిటికీలు బిగించాల్సి ఉంది. ఆయా పనులు పూర్తయితే దాదాపు ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లే. 160 ఇళ్లకు గాను పైపులైన్ పనులు 100 ఇళ్ల వరకు పూర్తి చేసే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టర్‌కు గత రెండేళ్లుగా బిల్లులు చెల్లించపోవడంతో ఆలస్యం జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.

కేటాయిపులపై ఆశలు

అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది డిసెంబర్ వరకు జరిగే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల తంతు ప్రారంభం కాకముందే పెండింగ్ పనులు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడానికి ముందస్తుగానే అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలను పేదల పరం చేసి ఎన్నికలకు వెళ్లాలనే ధృడ సంకల్పంతో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో బెల్లంపల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులు తుది దశలో ఉండడంతో పేదలు ఆశలు పెంచుకుంటున్నారు. నోటిఫికేషన్ వచ్చేలోగానే అర్హులకు కేటాయించే అవకాశాలు ఉంటాయని చర్చించుకుంటున్నారు.

గృహలక్ష్మి వైపు చూపులు..

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఈసారి కూడా పూర్తికాని పరిస్థితులు ఏర్పడితే లబ్ధిదారులు గృహలక్ష్మి పథకం వైపు దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సొంతింటి స్థలం ఉన్న లబ్ధిదారులకు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షలు ఇస్తామని ప్రకటించడంతో పేదల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. బెల్లంపల్లి మున్సిపాలిటీలో ప్రభుత్వ, సింగరేణి లీజు భూములు ఉన్నాయి. ఇటీవలనే ఇళ్లు కట్టుకున్న లబ్ధిదారులకు పట్టాలు కూడా జారీ చేస్తున్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా 10 వేల మందికి ఇళ్లపట్టాలు వచ్చే అవకాశాలు ఉండగా, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పూర్తికాని పక్షంలో నివేశన స్థలం ఉన్న పేదలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి సమాలోచనలు చేస్తున్నారు.

పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్లాస్టరింగ్ పనులు నిర్వహిస్తున్నారు. కొన్ని ఇళ్లకు పైపులైన్ పనులు నిర్వహిస్తున్నారు. వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం. బిల్లుల చెల్లింపు అంశం ప్రభుత్వ పరిధిలో ఉంది.

– పెద్దయ్య, ఆర్‌అండ్‌బీ ఇంచార్జి ఈఈ, మంచిర్యాల

కాపర్‌వైరు చోరీ నిందితుడికి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్సై అశోక్

మామడ: ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ చోరీ కేసులో మండల కేంద్రానికి చెందిన రాపని ఎల్లయ్యను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై అశోక్ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. రాపని ఎల్లయ్య 2017 నుంచి వరంగల్ జైలులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. ఆరేళ్ల నుంచి ప్రతి ఆరు నెలలకోసారి పెరోల్‌పై 30 రోజులు ఇంటికి వచ్చి జైలుకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్‌వైరు చోరీ చేస్తున్నాడు. తనకు పరిచయం ఉన్న పాత నేరస్తులు మహారాష్ట్రకు చెందిన ఫఖర్ గోరే, నిజామాబాద్‌కు చెందిన బాబురావు దండేల్వర్‌తో కలిసి కడెం, సోన్, లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్, మామడ మండలంలోని లింగాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ చోరీ చేస్తున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక సాయంతో వలపన్ని నిందితుడు ఎల్లయ్యను పట్టుకున్నారు. చోరీ కోసం వినియోగించిన రింగు పానలు, సెల్‌ఫోన్, కాపర్‌వైరును స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో ఫఖర్ గోరేను గత వారం అరెస్ట్ చేయగా, మరో నిందితుడు బాబూరావ్ దండేల్వర్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

తాంసి: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలం వడూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పందేం సాయికిరణ్(18) పదో తరగతి వరకు చదువుకున్నాడు. గ్రామంలో తండ్రికి కిరాణషాపు ఉంది. ఆయనకు చేదోడువాదోడుగా ఉన్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి సాయికిరణ్ మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చి రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని భీంపూర్ ఎస్సై రాధిక పరిశీలించి పంచనామా నిర్వహించారు. తండ్రి సంజీవ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.